చెహోవ్ కథ



# పాతకాలం



రష్యన్‌మూలం: చెహోవ్
తెలుగు గొంతు: కరుణారుణ

**ఈవెనింగ్ వాక్‌కు బయలుదేరిన మిగుయెవ్ ఒక టెలిగ్రాఫ్ స్తంభం దగ్గిర ఆగి నిట్టూర్చాడు. గతవారం, యిలాగే వచ్చినప్పుడు, సరిగ్గా యిదే స్తంభం దగ్గిర, పాత పనిమనిషి అగ్నియా తనను నిలదీసింది.**

"ఏమనుకుంటున్నావో, నా బతుకు నాశనం చేశావు. నేనూ నీ బతుకు బజారుకీడుస్తాను. నాలాంటి ఆడపిల్లల్ని యింకెంతమందిని పాడుచేస్తావు? పుట్టిన పిల్లను నేనేం చేసుకోను. నీ భార్యకే యిస్తాను. నీ బండారం బయటపెడతాను..."

ఆమె పేర అయిదువేల రూబుళ్లు బ్యాంకులో డిపాజిట్ చెయ్యాలిట. లేకపోతే అన్నంత పనీ చేస్తుందట. హా, ఎంత కష్టకాలం దాపురించింది. క్షణికోద్రేకానికి లొంగనేల? డబ్బుల్లేవు. ఇక యింటా, బయటా తన బతుకేంగాను!

ఇల్లు చేరుకొని, ముందర వాకిట్లో బెంచిమీద కూర్చున్నాడు. పదైంది. మబ్బుల్లోంచి చంద్రుడు తొంగి చూస్తున్నాడు. వీధంతా నిర్మానుష్యంగా వుంది. వృద్ధులు నిద్రపోతున్నారు. పడుచువాళ్లు సరదాలు ముగించుకొని యింకా యిళ్లకు చేరుకోలేదు. సిగరెట్టు వెలిగించటానికి అగ్గిపెట్టె కోసం జేబులు వెతుకుతుంటే మోచేతికేదో మెత్తగా తగిలింది. ఒళ్లు ఝల్లుమంది. బెంచీమీద ఏమిటిదీ? పక్కనే తాచుపాము చుట్టుకు పడుందని తెలిసినా అంత భయపడకపోను. చిన్న బట్టల మూట లాగుంది. ఓ అడుగు పొడుగ్గా, మెత్తటి గుడ్డల్లో చుట్టిన శిశువు. చిన్నారి చెయ్యి కనిపిస్తున్నది. గుండె

జారిపోయింది. భయం, దిగులు. మరి కాసేపట్లో తన మర్యాద మట్టిలో కలిసి పోవడం ఖాయం.

"ఇలా బ్లాక్ మెయిల్ చేస్తుందన్న మాట." అంటో పళ్లు కొరికాడు. ఎవర్ని నిందించి ప్రయోజనమేమిటి? పాపఫలం అనుభవించక తప్పదు కదా, హే భగవాన్!

సిగ్గు, అవమానం దహించేస్తున్నాయి. ఏం చెయ్యాలిప్పుడు? విషయం తెలిస్తే భార్య ఏం చేస్తుంది? ఆఫీసులో కొలీగ్స్ ఏమంటారు? బాస్ ఏమంటాడు? 'ఏమోయ్, జుట్టు నెరిసినా చిలిపి చేష్టలు పోనట్టుందే?' అంటాడా! బంధువులు, మిత్రులందరూ తనను వెలేస్తారు. 'మర్యాదస్తుని రంకు భాగోతం' అంటో పత్రికలో ప్రచురిస్తారు. ఇలాంటి శిశువుల్ని ఎవరింటి ముందో వదిలిన వార్తలు చదువుతూనే వున్నాడు.

డైనింగ్‌రూం కిటికీలోంచి భార్య కనిపించింది. వంటపనితో బిజీగా ఉన్నది. చిల్లరపనులు చేసుకొని బతికే ఎర్మోలాయ్ ఈలవేస్తూ పోతున్నాడు. బేబీ లేచి ఏడుపు లంకించుకుంటే గుట్టు రట్టవుతుంది. ఎట్లైనా పారిపోతే...

"ఈ శిశువును మరెవరి యింటిముందైనా వదిలేస్తే సరి. పద. పరిగెత్తు."

బ్రీఫ్ కేస్ పట్టుకున్నట్టుగా, ఒక చేత్తో మూట పట్టుకుని వడివడిగా నడిచాడు.

ఎవరైనా చూసి, 'ఏమిటది?' అని అడిగితే? త్వరగా. ఎవరింటి ముందర వదలాలి? ఇక్కడ కాదు. కిటికీలు తెరిచే వున్నాయి. జనం చూస్తున్నారు. ఎక్కడ? ఎక్కడ? మెల్కిన్ యిల్లైతే బెస్ట్. వాళ్లు ధనవంతులు కూడా. బిడ్డ దొరికినందుకు సంతోషిస్తారు కూడాను.

చేతిలో మూటను చూస్తే నవ్వొచ్చింది. ఇలాగేనా బిడ్డను ఎత్తుకునే పద్ధతి! ఒక ప్రాణం వున్న శిశువు. తనలాంటి మనిషి. మెల్కిన్ యింట్లో పెరిగితే వీడూ సంపన్నుడవుతాడు. పెద్ద ఉద్యోగం చేస్తాడు. మరో ముప్పై నలభై ఏళ్లలో తనే వాడికి శాల్యూట్ చెయ్యాలి. హ హ్హ హ.. అలాంటి వాణ్ణి నేను పాత బట్టలమూటలాగ తీసికెడుతున్నాను.

నారింజ చెట్లనీడలో నడుస్తున్న మిగుయెవ్ మనసు పశ్చాత్తాపంతో, బాధతో నిండిపోయింది.

ఎంత అమానుషం. ఎంత అన్యాయం. తన రక్తం పంచుకుని పుట్టిన బిడ్డను ఎవరింటి ముందర వదలాలా అని ఆలోచిస్తున్నాడు. తనంత దుర్మార్గుడెవరూ వుండడీ లోకంలో. నేరం చేసింది తను. పుట్టటానికి బాధ్యత వాడిదా? 'నేను స్కాండ్రెల్ని. సరదా కావాలి గాని బిడ్డ వద్దు' సుఖం తనకు. కష్టాలు వీడికి. మెల్కిన్ ఏం చేస్తాడు? ఏ అనాథాశ్రయంలోనో చేరుస్తాడు. అక్కడ వీణ్ణెవరు ముద్దు చేస్తారు? ఎవరు ప్రేమ పంచుతారు? చీవాట్లు, దెబ్బలు. మురికి. అర్ధాకలి తిండి. పెరిగి, రోడ్డు పక్కన కూలీగానో, చిన్న చిన్న నేరాలు చేస్తూనో బతుకుతాడు. దురలవాట్లకు బానిసవుతాడు. తాగుబోతుగా మారతాడు. చివరకి ముష్టెత్తుకుంటూ, మురికి కాలవ పక్కన, గుడిశెల్లో ఎక్కడో... తనవంటి ఘరానా వ్యక్తికి పుట్టిన బిడ్డ జీవితం యిలా కాబోతోంది.

గుడ్డ పక్కకు తొలిగించి మొహం పరికించి చూశాడు. ఆహా, అంతా తన పోలికే. ఎంత గాఢ నిద్రలో వున్నాడో! తన తండ్రి తనను రోడ్డు మీద వదలటానికి సిద్ధమవుతున్నాడని వీడికి తెలుసా! నా బుజ్జినాన్నా, ఈ పాపిష్టి తండ్రిని క్షమించు. విధిరాత అంటే యిదే కదా!

వదలడానికి మనసొప్పలేదు. కన్నీళ్లు ధార కట్టాయి. హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోయింది. ఇలాంటి అవాంఛిత శిశువులే పెరిగి సమాజానికి చీడ పురుగులుగా మారతారు.

వీణ్ని కన్నందుకు నేనెందుకు సిగ్గుపడాలి? ఎవరేమనుకుంటే నాకేమిటి? తన భార్య తనకు పిల్లల్నివ్వ లేకపోయింది. వీణ్ని పెంచుకుంటే ఎంత బాగుంటుంది. వెళ్లి భార్య కాళ్లమీదపడి వేడుకుంటాడు.

"నేను పాపిని. నీచుణ్ని. నీ భర్తగా ఉండే అర్హత లేదని అంగీకరిస్తాను. నీ యిష్టం వచ్చిన శిక్ష విధించు. సంతోషంగా అంగీకరిస్తాను. కాని ఈ చిన్నారిని మాత్రం అనాథగా పెరగనివ్వకు. మనకు పిల్లల్లేరు. వీణ్ని పెంచుకుందాం" భార్యది జాలిగుండె. కాసేపు ఏడ్చి గోలపెట్టినా, తన మాట కాదనదు.

ఎటూ తేల్చుకోలేకపోతున్నాడు. పెంచుకుంటే బాగానే వుంటుంది. కాని అందరూ తనను బహిష్కరిస్తారు. ఇక్కడ వదిలేసిపోతే... వీడి బతుకేమవుతుందో కదా! చివరికి పితృవాత్సల్యమే జయించింది. కొడుకోసం ఎంత అవమానమైనా భరిస్తాడు.

చేతుల్లో పెట్టిన బిడ్డను భార్య తిరస్కరించలేదు.

"ఇదుగో, వీడు నా బిడ్డ. పనిమనిషి అగ్నియా వుండేది కాదు. ఆమెకూ నాకూ పుట్టిన బిడ్డ. నీ కోపమంతా నామీద చూపించు. వీడికి మాత్రం తల్లి ప్రేమను పంచు." అని ఆ పిల్లాణ్ని భార్య కాళ్ల దగ్గిర వదిలి సిగ్గుతో బయటకు పరిగెత్తాడు.

దానికోపం కాస్త తగ్గనీ. తరువాత నెమ్మదిగా వెళ్లి బుజ్జగిస్తాడు.

ఎర్మోలాయ్ అటూ యిటూ చూస్తూ తిరుగుతున్నాడు.

"ఏం కావాలా?"

"చాకలి మనిషి ఆక్సిన్యా లేదూ. అది తన బిడ్డను యిక్కడెక్కడో వదిలి వెళ్లిందట. మళ్లీ వచ్చి చూస్తే కనిపించలేదు. ఎవరు తీసికెళ్లుంటారా అని వెదుకుతున్నది."

"ఏమిటీ, మళ్లీ చెప్పు" మిగుయెవ్ గొంతు వణికింది.

ఎర్మోలాయ్‌కి పరిస్థితి అర్థమైంది.


"ఏదో కక్కుర్తి పడ్డానులేండి. తప్పు నాదే మీది కాదు."

ఛ. తనంత ఫూల్ ఎవరూ వుండడీ లోకంలో.

"గెటౌట్. యూ యిడియట్."

పిల్లాణ్ని ఏం చేసుకోవాలో తెలియక భార్య కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కూర్చున్నది.

"హ.. హ్హ... హ్హ... నువ్వు నిజంగా నమ్మావు గదూ. నేను జోక్ చేశాను. చాకలి మనిషి ఆక్సిన్యా లేదూ, దాని బిడ్డ. వెళ్లి ఎర్మోలాయ్‌కి యిచ్చేసిరా. త్వరగా వెళ్లూ" అంటూ సంతోషంతో గంతులేశాడు మిగుయెవ్. ■



## మారుతున్న రాగాలు

సంగీతదర్శకుడు సందీప్ చౌతా దర్శకుడు కాబోతున్నాడు. అందులో హీరో నాగార్జున. హీరోయిన్‌లు టబ్బూ, శ్వేతాఅరోరా. సంగీతం మానుకుని ఇదేం పని?-అనుకో వచ్చు కానీ, సందీప్‌కు స్ఫూర్తి ఎవరో తెలుసా? బాలీవుడ్‌లోనే వున్న మరో సంగీతదర్శకుడు విశాల్ భరద్వాజ్. అతను కొంత కాలం క్రితం తీసిన పిల్లల చిత్రం 'మక్‌డీ' (సాలీడు) హిట్టయింది. అదీ సంగతి!